



(24 వ భాగము)

అయాచితంగా, అసంకల్పంగా అన్న ఆమెమాట వెనుక నాకు కోటి అర్థాలు స్ఫురించాయి.

"ప్రయత్నమా? ఏమిటది??" అడిగాను.

"నో! నథింగ్! నువ్వు నాతో రావద్దు. ఇక్కడే పడుండు. నీలాంటివాళ్ళెక్కడున్నా ఒక్కటే!" అంది లేవబోతూ.

చెయ్యిపట్టి బలంగా గుంజి కూర్చోబెట్టాను నామెను.

"ఏమిటీ దౌర్జన్యం?" అడిగింది కోపంగా కూలబడుతూ.

"తొందరపడకు. చెప్తాను. ఇంతకూ నువ్వు చెప్పిన ఆ ప్రయత్నం ఏమిటీ?" అడిగాను కాస్త కటువుగా.

"ఏమీ లేదన్నానుగా?" తప్పించుకో చూచింది.

"నేను చాలా మొండివాణ్ణి. కొంతమంది నన్ను మూర్ఖుడివని కూడా అన్నారు. ప్రాణాలు తియ్యడం నాకు చేతనయినంత బాగా మరెవ్వరికీ చేతకాదు. మనిషి ఆయువు పట్లు ఎక్కడుంటాయో, ఎంత తక్కువ హింసతో, ప్రాణిని, శవంగా మార్చవచ్చునో నాకు బాగా తెలుసు. నువ్వు రేపు మీ దేశం, అదే నువ్వు అనుకొనే స్వర్గం అమెరికాకు పోవాలనుకుంటున్నావ్? ప్రాణాలతో వెళ్ళి మళ్ళీ మీ వాళ్ళను చూడాలనుకొంటే నాకు కావలసిన విషయాలు కొన్ని చెప్పు. అలా చెప్పనంటే, ఈ విశాలమైన ఎడారీ, అడవిలాంటి దీవిలో, ఆరడుగుల గొయ్యి నేనే తీసి, నీ శవాన్ని అందులో పూడ్చి, పైన ఏవిధమైన సంకేతం కూడా వుండకుండా జాగ్రత్తలు తీసుకొని వెళ్తాను. ఏమంటావ్?" అడిగాను సీరియస్‌గా.

నా మాటలకామె మొఖం పాలిపోయింది.

"డోంట్ బీ ఎ బ్రూట్!" అంది కోపంగా.

"బ్రూట్‌ను మాత్రమే కాదు! బీస్ట్‌ను గూడా కాగలను. చెప్పు! త్వరగా చెప్పు!" అన్నాను.

ఆమె చెయ్యి నా చేతిలో వుంది.

బొటనవ్రేలి క్రింది భాగాన వున్న నరం నలిపాను. "అమ్మో!" అని గావుకేక పెట్టింది.

"అది సాంపిల్ మాత్రమే! అంతకన్నా బాధాకరమైనవి అసలువి వేరే వున్నాయి. చూపించమంటావా?" అడిగాను.

"ఒంటరి ఆడదాన్ని నమ్మించి ఇలా తీసుకొచ్చి చంపుతానని బెదరించడం పెద్ద మగ లక్షణంకాదు!" అందామె.

"ఆ లక్షణాలు లేవని అనుమానపడుతున్న విషయం

నీకు ముందే చెప్పాను. దానిగొడవ వదిలెయ్! అసలు వ్యవహారంలోకి రా! డెల్లాను ఏంచేశావ్?" అడిగాను.

"నేనేం చెయ్యలేదు! నాకు తెలీదు!" అంది.

అరచేతిని కత్తిలాపెట్టి, శరీరంలోని బలాన్నంతా దమ్ముపట్టి అందులోకి జేర్చి, ఆమె కాలర్ బోన్ క్రింద విసురుగా కొట్టాను. వెల్లకింతలా పడిపోయింది ఇసుకలో.

లేచి నిలుచున్నాను.

మెడకున్న మఫ్లర్ కు పేలికలుచించి, కాళ్ళూ, చేతులూ విడివిడిగా కట్టేశాను.

సిగరెట్ కాల్చుకున్నాను.

పొగ వదిలాను దట్టంగా.

"నన్నేం చేస్తున్నావ్?" అడిగింది దీనంగా.

"అలా తొందరపడకు. చూస్తూ వుంటే నీకే తెలుసుంది" అంటూ కాలుతున్న సిగరెట్ ఆమె చెక్కిలిపైన పెట్టాను. దాని వేడికి చర్మం కాస్త కాలింది. ఎగిరి పడింది గాల్లోకి.

"కాల్చకు! దయచేసి నన్ను కాల్చకు!" అంది దీనంతా వేడుకొంటూ.

"అయితే చెప్పు! డెల్లాను ఏంచేశావ్?"

"చెప్తాను!" అంటూ తన్నుకులాడి తనకుతానే లేచి కూర్చుంది.

"నిన్ను నాతో అమెరికాకు తీసుకెళ్ళాలనీ, నిన్ను పెళ్ళాడి, స్వర్గసౌఖ్యాలు రుచిచూడాలనీ కలలుగన్నాను. డెల్లాను నువ్వు అస్తమానం కలవరించడం, ఆమె పేరు పదేపదే పలవరించడం గమనించాను. ఆమెపై నీకున్న ప్రేమ ఎంత దట్టమైందో అర్థంచేసుకున్నాను. ఆమె

బ్రతికి వుండగా నువ్వు నాతో నా దేశం రావనుకున్నాను. ఆమె నెలాగైనా నీనుంచి వేరుచేస్తే, నువ్వు కాస్త ఆలస్యంగానైనా నా వాడివవుతావన్న నమ్మకం కలిగింది. అందుకే ఆమెను వదలించుకునే మార్గాల గురించి అన్వేషణ సాగించాను. ఒకరోజు ఈ దీవి మొత్తం గాలించాను'' అంటూ ఆగింది ఆమె.

''ఎందుకు?'' అడిగాను.

''ఎవ్వరికీ కనుపించకుండా దాచేందుకనువైన స్థలం దొరుకుతుందేమోనని...'' అంది మెల్లగా.

''ఊఁ! తర్వాత ఏమయింది?''

''నిర్మానుష్యంగా వున్నాయి అన్ని ప్రాంతాలు. ఆమెను చంపేసి శవాన్ని పూడ్చిపారేద్దామనుకున్నాను. ఏవైనా జంతువులు వెలికిలాగి పట్టిస్తాయేమోనని భయపడ్డాను. పోనీ సముద్రంలో పారేద్దామనుకున్నాను. అందులోనూ ప్రమాదం పసిగట్టాను. అలల తాకిడికి ఒడ్డుకు కొట్టుకొచ్చే అవకాశాలున్నాయి. అంతలోనే ఆమెకు మతి స్థిరంలేని విషయం గుర్తొచ్చింది. ఆమెను కట్టుదిట్టంగా బంధించి కాపలా కాస్తున్నారు. రాత్రిళ్ళు, నాతో వచ్చిన రెండో నర్సు డ్యూటీ చేసేది. ఆమెకు ఇక్కడున్న సైంటిస్టుల్లో ఒక ప్రియుడున్నాడు. రాత్రిళ్ళు అతనితో గడపడానికి వీలులేకపోవటంతో ముందు విసుక్కొంది. అది నేను తెలుసుకున్నాను. నేను పేషెంటును చూస్తూం టాననీ, తనను వెళ్ళిపొమ్మనీ చెప్పాను. అవసరమైతే వచ్చి పిలుస్తానని చెప్పాను'' అంది అమెరికన్ నర్సు.

నా రక్తం లావాలా కుతకుతమని ఉడుకుతూ, గుండెల్లోంచి ఉబికి కళ్ళలోకి తన్నుకురావటం మొదలెట్టింది.

"ఆ రాత్రి చాలాసేపు ఆలోచించాను. మెల్లగా తలుపులు తెరచాను. నన్ను చూసి పైకి దూకింది. భయపడ్డాను. అపిల్స్ కోసే కత్తితీసి పొడుస్తానని భయపెట్టాను. దాంతో కాస్త తమాయించుకుంది. దగ్గరకంటూ వెళ్ళి కాళ్ళకు చేతులకూ తగిలించిన గొలుసులు తీశాను. బోనులోంచి బైటకు వదలిన సింహంలా పరుగెత్తుకొని వెళ్ళిపోయింది చీకట్లో. నేనూ వెంటపడ్డాను. ఇద్దరం చాలాదూరం పరుగెత్తాం!"

"ఏ వైపుకు పరుగెత్తింది? సముద్రంలోకా?" అడిగాను కోపంగా.

"కాదు! అదుగో దూరంగా కనుపిస్తున్న ఆ పర్వతాల వేపుకు" అంటూ చూపించింది.

"ఆ తర్వాత!"

"అక్కడిదాకాపరుగెత్తింది. చకచక కొండ లెక్కింది. నేనూ కొంత దూరం వెళ్ళాను. ఆమెలా సులభంగా ఎందువల్లో ఎక్కడం నావల్ల కాలేదు. చూస్తుండగానే ఆ రాళ్ళల్లో ఆమె రూపం అంతర్ధానమైపోయింది. కాసేపు చూశాను. కనుపించలేదు. ఎటో వెళ్ళివుంటుందనుకుంటూ అలిసి వచ్చేశాను బిల్డింగుకు. వచ్చాక ఒక పది నిముషాలు రెస్టు తీసుకొని, తిన్నగా నర్స్ వున్న గది వద్దకు వెళ్ళి తలుపు తట్టి పిలిచాను. ఆమె వెలుపలికొచ్చింది. జరిగింది చెప్పకుండా, పేషెంటు తప్పించుకొని పోయిందని చెప్పి, మెల్లిగా నా గదికి వెళ్ళిపోయాను," అంది ఆమె.

సిగరెట్ దూరంగా విసిరి పారేశాను.

"నువ్వు మనిషివి కాదు! రాక్షసివి!! లేకుంటే మతిస్థిరం లేని మనిషిని అలా నిర్దాక్షిణ్యంగా వదిలివెయ్యావు. నర్స

ఎలా అయ్యావో నాకు తెలీడంలేదు. నిన్ను నిలువునా చంపేసినా పాపంలేదు!" అన్నాను కోపంగా.

నా కళ్ళలోకి చూసింది. వెంటనే తల వంచుకుంది. నేలచూపులు చూస్తూ "అయితే నన్ను చంపుతావా?" అడిగింది.

"ఆఁ! చంపుతాను!" అన్నాను.

"వద్దు! ప్లీజ్! తెలీక తొందరపడ్డాను. నువ్వు కావాలనుకుని, పిచ్చిగా ప్రవర్తించాను. ఇకపైన ఎప్పుడూ అలా చెయ్యను, ఈమారు క్షమించి వదిలెయ్! మా దేశం వెళ్ళిపోతాను" అందామె దీనంగా వేడుకుంటూ.

"లాభం లేదు! నిన్నలా వదిలేస్తే నన్ను భగవంతుడు క్షమించడు. లే! నా వెంట రా!" అన్నాను లేచి, ఆమె కాళ్ళకున్న కట్లుమాత్రం విప్పి.

ఆమె లేచి నుంచుని "ఎక్కడికి" అడిగింది.

"ఏమో? నాకు మాత్రం తెలుసా ఏమిటి? నువ్వు ముందు నడువు! డెల్లా వెళ్ళిన వేపుకు పద. మన ఇద్దరం కలసి ఆమెను వెతికి పట్టుకోవాలి. ఆతర్వాత ఆమె క్షమిస్తే నిన్ను వదిలేస్తాను. లేకుంటే ఆమె ముందే నిన్ను ముక్కలు ముక్కలుగా నరికి కాకులకు, గద్దలకు వేస్తాను" అన్నాను.

ఆమె మారుమాట లేకుండా కదలింది.

ముందామె నడుస్తోంది.

వెనకగా నేను వెళ్తున్నాను.

ఇద్దరం దాదాపు ఐదారు మైళ్ళు నడిచాం. సాయంత్రం అయ్యేసరికి కొండలవద్దకు వచ్చాం. చీకటి అక్కడక్కడా అలముకుంటూంది.

వెనక్కిపోదామా అన్నట్లు వెనక్కి తిరిగిచూసింది నాకేసి అమెరికన్ నర్స్ ఆశగా.

"ఎక్కి?" అన్నాను గుట్టలు గుట్టలుగా పడివున్న ఎత్తైన రాళ్ళను చూపించి.

"చీకటి పడుతూంది. మళ్ళీ తిరిగి రాలేము. చీకట్లో ఎక్కడని కనుపిస్తుంది. ప్రొద్దున్నే వచ్చి వెతుకుదాముకి?" అడిగిందామె.

"నో! పగలూ, చీకటీ, రాత్రీలాంటివి లేవు నీకూ, నాకూ. ఆమెను వెతకడమే మన పని. ఎక్కు!" అన్నాను కఠినంగా.

ఆమెకు వేరే దారి తోచలేదు. రెండు గుట్టలెక్కింది. చేతులకున్న కట్లు అడ్డు రాసాగాయి. వాటినికూడా విప్పేశాను. ఆమె నాకన్నా ఎత్తుగా, లావుగా వుంది. బలంగా కూడా వుంది. ధైర్యంచేసి తిరగబడితే నే నామెను కంట్రోలు చెయ్యడం కొంత కష్టమే కావచ్చు. అయితే, నా దగ్గర చిన్న రివాల్వరూ, పెద్ద కత్తీ వున్నాయి. అవే నాకు రక్షక కవచాలు. వాట్ని అంతకుముందే చూసి వుందామె. నాకు కోపం ఎక్కువైతే ఆవేశంతో ఆమెను అవలీలగా చంపివెయ్యగలనన్న అనుమానం వుందామెకు. అందుకే భయపడిపోయింది. ఇద్దరం మరో గంటసేపు కష్టపడి కొండలు ఎక్కాం. దాదాపు సగంఎత్తు పైదాకా వచ్చేశాం.

ఆమె కాళ్ళకు చెప్పుల్లేవు. రాళ్ళు గ్రుచ్చుకుని రక్తం కారింది. రెండుసార్లు చూసుకుని, తుడిచేసుకొంటూనే ఏడ్చింది.

చదునుగావున్న పెద్ద బండపైన ఠక్కున కూర్చుండిపోయింది. వెనువెంటనే వెల్లికింతలా పడుకుంది. నా కర్థం

కాలేదు ఆమె ఎందుకలా చేస్తూందో? అడిగా నామె నా మాట.

కాళ్ళు నొప్పులు పుడుతున్నాయంది. ఇంకో అడుగు ముందుకు వెయ్యలేనని చెప్పింది.

కత్తి తీసి బెదరించాలనుకున్నాను.

మరీ అమానుషంగా ప్రవర్తించడం ఎందువల్లో నాచేత కావడంలేదు. కాస్త విశ్రాంతి తీసుకోవడం నాకూ అవసరంగానే వుంది. అంతకు ముందులా నడవలేకున్న విషయం, అర్థమవుతూంది నాకు.

నేను కూర్చున్నాను ఆమె ప్రక్కగా.

"నర్స్!" పిలిచాను మెల్లిగా.

"ఏమిటి? నడవకుంటే చంపుతానంటావా?" అడిగింది పడుకునే వెల్లికింతలా.

"కాదు! డెల్లా ఈ త్రోవనే వచ్చిందా?"

"ఆ! ఇక్కడిదాకా నాకు కనుపించింది. ఆపైన కనపడలేదు. వెనక్కి వెళ్ళిపోయాను" అంది.

ఆలోచిస్తూ కూర్చున్నాను.

ఇంతదాకా వచ్చిన మనిషి ఏమయిపోయి వుంటుంది. క్రూరమృగాలేమైనా వచ్చి వుంటాయా! అలాటివి వున్నట్లు శాస్త్రజ్ఞులు కూడా ఎవరూ అనుకోగా వినలేదు నేను.

ఏవైనా గుహలలాంటివి వున్నాయేమోననుకున్నాను. అలాంటివి వున్నా రాత్రిళ్ళు కనుపించవు. తెల్లవారాక వెతకాలి. ఆమెకు కాస్త దూరంగా నేను వెల్లికింతలా పడుకున్నాను. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. చందమామ ఇంకా రాలేదు.

"ఆకలవుతూంది! తినేందుకేమైనా వుందా?" అడిగింది నర్స్ అర్థిస్తున్నట్లు.

నా దగ్గర రెండు బిస్కెట్ పాకెట్లున్నాయి. ఇవ్వడమా, మానడమాని కాసేపు సందిగ్ధంలో పడ్డాను. ఆమెనలా ఆకలితో మాడ్చి మాడ్చి, ఆలసటతో, అశక్తతతో, తనకుతానే చచ్చేట్లు చెయ్యడం నా కోరిక. అది తీర్చుకోవాలనిపించింది.

"ఉంది! కానీ నువ్వు తినడానికి కాదు! నా కోసం తెచ్చుకున్నాను," అన్నాను.

"అలా ఆకలితో అల్లాడి నేను చావాలని నీ పథకం! అవునా! అది అమానుషం! నాపై నున్న కత్తు తీర్చుకోవాలంటే అదికాదు పద్ధతి! కాల్చి చంపు. ఒక్కదెబ్బకు నీ కోరిక తీరుతుంది. నాకు బాధ వుండదు!" అంది ఆమె.

"అలాంటి చావు నీకు రాగూడదు!" అన్నాను.

"ఎందుకని?"

"నన్ను అనవసరంగా ప్రశ్నలతో విసిగించకు. నోరు మూసుకుని పడుకుని విశ్రాంతి తీసుకో!" అన్నాను విసుగ్గా.

"ఆమెమీద నీ ప్రేమ నన్ను ఇంత దారుణంగా హింసించేందుకు పురిగొల్పింది. అలాగే నాకున్న నీపైని ప్రేమ ఆమెనలా వదిలేసేందుకు ప్రోత్సహించింది. దానికే నేనేదో పెద్ద తప్పు చేసినట్లుగా నువ్వింత నీచంగా నన్ను చూడటం బాగులేదు! ఇద్దరం కలిసి ఆమెను వెతుకుదామని బయలుదేరాం! అలాంటప్పుడు నన్నింకా విరోధిలా చూడటం మంచితన మనిపించుకోదు!" అంది నాకేదో సలహా ఇచ్చినట్లు.

వినీ, విననట్లే ఊరుకున్నాను.

"నాకు ఆకలితో పేగులు తెగిపోతున్నాయి!" అంది మళ్ళీ.

డెల్లా గుర్తొచ్చింది నాకు.

ఇంతకన్నా విపత్కర పరిస్థితుల్లో చిక్కుకున్నప్పుడు ఆమె ఈమెలా బేలపడిపోలేదు. ఆకలిని అదుపులో పెట్టుకొంది. నాకు ధైర్యం చెప్పింది. అందుకే బహుశా డెల్లాను మరచిపోలేక పోతున్నానేమో ననిపించింది.

"నీ దగ్గరున్న ఆహారం నాకు కొద్దిగా పెట్టవూ" మోచేతిపైన బరువు మోపి ప్రక్కవాటుగా తిరిగి అడిగింది మళ్ళా.

పాంటు జేబులో చెయ్యిపెట్టి బిస్కెట్ పాకెట్ లాగాను. వెలుపలికి తీసి ఆమెపైకి విసిరాను.

దాన్నందుకుని పై పాకింగు నోటిలోనే పరపర పీకేసింది. లోనున్న బిస్కెట్లను రెండేసి, మూడేసి చొప్పున కరకర నమలసాగింది.

నేను లేచి కూర్చున్నాను.

క్వార్టర్ బాటిల్ బ్రాందీ తీసి కార్కు నోటితోనే త్రిప్పి ఊడబీకాను. సగంవరకు గటగటమని తాగేశాను.

"దాహం అవుతూంది. గొంతుకూడా పట్టుకుపోయింది. నాకు కాస్త డ్రింకు ఇవ్వు!" అడిగింది మళ్ళా.

ఆమెపైని నాకసహ్యం వేసింది.

సీసా ఆమె కందించాను.

ఆత్రంగా అందుకుని నోటికి కరిపించుకుంది.

ఒకేసారి మొత్తం త్రాగేసింది. సీసా దూరంగా విసిరింది. అదో రాయిపైన పడి ఘల్లుమని శబ్దంచేస్తూ, ముక్కలు ముక్కలుగా పగిలి పడిపోయింది.

"వెలుతురొచ్చిందాకా పడుకో! ఆ తర్వాత లేచి వెతుకుదాం!" అన్నాను ఆమెతో.

చెయ్యి మడచి తలక్రింద పెట్టుకుంది.

మరో రెండు నిముషాల్లోనే ఆమె గాఢనిద్రలో కొరిగిపోయినట్లు పసిగట్టాను, గుర్రుమంటూ పెడుతున్న గురకను విని.

నాకు ఎక్కవలసిన మిగిలిన ఎత్తుకొండలు కనుపిస్తున్నాయి. వాటిపైనుంచి తొంగిచూస్తున్న చందమామ దగ్గరకు వెళ్ళగలిగితే, లోకమంతా నాకు కనుపిస్తుంది గదా అనుకున్నాను. ఆ ఎత్తునుండి ఆ వెలుగులో డెల్లా ఎక్కడున్నా సులభంగా గుర్తుపట్టగలను గదా అనుకున్నాను. భగవంతుడు నాకా ఎత్తులకు వెళ్ళే శక్తి నిచ్చివుంటే ఎంతో బాగుండును కదా అనికూడా అనుకున్నాను.

కమ్మరి పురుగుల్లాంటి ఆలోచనలు నా బుర్రను తొలుస్తూంటే నిద్రపోవాలని వున్నా, కళ్ళు మూతపడనన్నాయి. వొళ్ళంతా బాగా అలసిపోయి వుంది. విశ్రాంతి దానికీ అవసరమే! అయినా డెల్లాను ఎలా వెతకాలన్న ఆలోచనల వెనక్కి యివన్నీ త్రోసివేయబడ్డాయి.

తెల్లవారిందాకా అలా మిడిగుడ్లు వేసుకొని చూస్తూ కూర్చున్నాను. అమెరికన్ నర్స్‌మాత్రం హాయిగా నిద్ర పోతూంది.

వెలుతురు వెల్లువలా మాపైనా, చుట్టూ ప్రవహించి నిండుకుంది. ఆమెను చేత్తో తట్టి లేపాను.

అయిష్టంగా, లేచి కూర్చుంది.

"అప్పుడే తెల్లవారిందా?" అడిగింది ఆశ్చర్యంగా.

"కనుపించటంలే!" అన్నాను చిరాకుగా.

"నువ్వు నిద్రపోలేదా?" అడిగింది నర్స్ నా కళ్ళకేసి పరీక్షగా చూసి.

"లేదు!" అన్నాను.

"ఇంక లేద్దామా!"

"ఇఁ!" అంటూ సర్దుకుని లేచాను.

"ఎటు వెళ్దాం? ముందుకుపోయి మరే ప్రయోజనం సాధించే అవకాశం కనుపించటంలేదు. ఆమె యెటు పోయిందో, ఏమయిందో? ఆమెకోసం వెతుకుతూ మనమూ ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటామేమోనన్న భయంగా వుంది. తిన్నగా వచ్చినదారినే వెనక్కి వెళ్ళిపోదాం! ఏమంటావ్?" అడిగింది నర్స్.

కాస్త సుఖనిద్ర దొరకగానే, శరీరం సుఖంవైపు పరుగెత్తుతూం దనుకున్నాను.

"వెనక్కి వెళ్ళే ప్రశ్నలేదు! నా అభిప్రాయాలు ముందే చెప్పాను." అన్నాను నిక్కచ్చిగా.

"అయితే వెళ్ళి వెతుకుదామంటావ్?"

ఆమె ప్రశ్నకు సమాధానంగా రాళ్ళు ఎక్కటం మొదలెట్టాను. పదడుగులు వెళ్ళి వెనక్కు చూశాను. ఆమె నా వెనుక వస్తూవుంది కొంతదూరంలో.

అలా ఆ కొండపైకి ఎక్కేసరికి మిట్టమధ్యాహ్నమైంది మాకు. నా కాళ్ళకు కత్తుల్లాంటి రాళ్ళు గ్రుచ్చుకుని, గాయాలయి రక్తం ప్రవహించసాగించి. ఆ ప్రవాహాన్ని ఆపేందుకని మెత్తటి మట్టి తీసి ఆ గాయాల్లోకి కూరాను. విపరీతమైన మంట, నొప్పి పుట్టాయి. తమాయించుకున్నాను.

అమెరికన్ నర్స్ పరిస్థితికూడా నాలానే వుంది. లావుపాటి ఆమె తొడలు, విశ్రాంతిలేని నడక రాపిడివల్ల,

మంటలు పుట్టాయని చెప్పి, దూరదూరంగా కాళ్ళు పెట్టి వెల్లకింతలా పడుకుంది కొండపైకెళ్ళాక.

కొండపై అంచున నిలుచుని చూశాను. క్రిందిభాగాన వున్న విశాలమైన బయలుప్రదేశం కనుపించింది. అక్కడికి చేరుకోవా లనుకున్నాను. అంతలోనే నాకో అనుమానం వచ్చింది. నాకే అతికష్టంగా వున్న ఈ ప్రయాణం, మతి స్థిరంలేని డెల్లా ఎలా చేసివుంటుందని. నాది కేవలం వ్యర్థప్రయత్నం, వృధాప్రయాసలేమో ననిపించాయి. అలాగని నర్స్ చెప్పినట్లు వెను దిరగటానికి మనస్కరించ లేదు.

కొండ దిగడం మొదలెట్టాను. ఆమెకూడా లేచి నా వెంట రావడం మొదలెట్టింది. ఈ ప్రయాణం అంత కష్టంగా అనిపించలేదు. అంతేగాక బాగా వేగంగా దిగగలుగుతున్నాం.

దాదాపు సగం ఎత్తు దిగాం. క్రిందిభాగం బాగా స్పష్టంగా కనుపించసాగింది. చిన్న చిన్న తుప్పలు, చెట్లు, పచ్చిక పెరిగిన బయళ్ళు కనుపించాయి. ఆ దృశ్యం హృద యానికి ఆహ్లాదకరంగాకూడా వుంది.

గబగబ క్రిందికి దిగాం.

సూర్యుడు నడి నెత్తిపైకి వచ్చేసరికి బాగా క్రిందికల్లా వచ్చేశాం ఇద్దరం.

చుట్టుపక్కలంతా కలయజూశాను. ఎక్కడా ఏవిధ మైన మానవసంచారం వున్నట్లు తోచలేదు. ఒక చిన్న చెట్టు నీడన కూర్చున్నాం.

"ఆమె ఆ కొండ దాటి ఇటుగా వచ్చి వుంటుందని నాకు నమ్మకం లేదు!" అంది నర్స్.

"నాకూ లేదు! అయినా ప్రయత్నించాలిగా!" అన్నాను.

"ఆమె మతిస్థిమితం లేని మనిషి. ఏ సముద్రంలోనో దూకి ఆత్మహత్య చేసుకుందేమో?"

"మళ్ళీ ఆ మాటనకు! ఆమె చావదు! బ్రతికే వుంది. కానీ ఎక్కడుందో కని పెట్టాలి. అంతే!" అన్నాను.

"దాహంగా వుంది!" అంది నర్స్.

నాకూ దాహంగా వుంది. ఎక్కడైనా నీళ్ళు దొరుకు తాయేమో చూద్దామని లేచాను.

"నేనూ వచ్చేదా?" అడిగింది.

"వద్దు! ఇక్కడే వుండి కాస్త విశ్రాంతి తీసుకో. వెళ్ళి చూసొస్తాను" అన్నాను.

ఆమె చెట్టుకు చేరబడి కూర్చుని కాళ్ళు బార్లా జాపు కుంది. నేను బయలుదేరాను ముందుకు.

నా చుట్టూ పరికించి పరిశీలగా చూస్తూ నడవసాగాను ముందుకు. అడుగు అడుగుకు, చిన్న చిన్న ముళ్ళపొదలు, తుప్పలు, లావుపాటి రాళ్ళు అడ్డం వచ్చాయి. వాటిని తప్పించుకుంటూ నీళ్ళజాడ కోసం ముందుకు పోసాగాను.

ఎక్కడా చిన్న గుంట కూడా కనుపించలేదు.

ఈ ప్రాంతాల్లో ఎక్కడా నీళ్ళు దొరకవేమో ననిపించింది. అయినా పట్టు వదలని విక్రమార్కుడిలా, ప్రయత్న విరమణ చెయ్యకుండా ముందుకు సాగిపోయాను. మరో పది నిముషాల నడక నడిచాక, విశాలమైన బయలు ప్రదేశం కనుపించింది.

పచ్చటి పట్టు పరుపులా, ఎండ వెలుగులో మెరిసిపోతూంది ఆ ప్రదేశమంతా. గడ్డి క్రిందనున్న నల్లటి మట్టి కాలికి మెత్తగా తగిలింది. అంతకుముందు రాత్రి బహుశా వాన కురిసి వుండాలనుకున్నాను.

ఇంకొంత ముందుకు వెళ్ళాను.

గుండ్రంగా వున్న చిన్న కొలనులో ఏదో కనుపించింది. నీళ్ళు నల్లగా వున్నాయి. ఆ రంగునుబట్టి బాగా లోతు వుండాలనుకున్నాను. అంచున వొంగి కూర్చుని, రెండు చేతులు దోసిలిపట్టి, నీళ్ళలో ముంచి పైకి తీశాను. ఆ నీళ్ళతో మొహం కడుక్కున్నాను. కొద్దిగా నోట్లోకి వెళ్ళాయి. అవి బాగా తియ్యగా వున్నాయి.

దాహంతో తాపంతో నీరసపడిపోయిన నేను, గబ గబ నీళ్ళు త్రాగాను కడుపునిండుగా. కాళ్ళు కూడా కడుక్కున్నాను.

అప్పుడు నాకు అమెరికన్ నర్స్ గుర్తొచ్చింది.

ఆమెకు నేను దాదాపు మైలు దూరంలో వున్నాను. ఆమె కూడా దాహంతో అల్లాడిపోతున్నది. ఇక్కడినుండి నీళ్ళు తీసుకెళ్ళేందుకేమైనా పాత్రలాంటి దేదైనా దొరుకుతుందేమోనని చుట్టూ చూశాను. ఏదీ కనుపించలేదు. వెళ్ళి ఆమెను వెంటబెట్టుకుని రావడంకన్నా వేరే మార్గం లేదనుకున్నాను.

వెనక్కి నడవడం మొదలెట్టాను.

వంద గజాలు నడిచాక, ఒక చిన్న ముళ్ళతుప్పకు చిక్కుకుని గాలిపటంలా రెపరెపలాడుతున్న తెల్లటి కాగితంలాంటిది కనుపించింది. అదేమిటో దగ్గరకెళ్ళి చూడాలనిపించింది. అటుకేసి అడుగులు వేశాను. ఆ తెల్లటి వస్తువును చేత్తో తాకాను. అది ఆడవాళ్ళు వేసుకొనే షర్టని సులభంగానే తెలుసుకున్నాను. ఘట్టిగా లాగాను. ముళ్ళతుప్పనుండి ఆ షర్టు విడిరాలేదు. మరీ గుంజితే చినిగిపోతుందని, వొంగి కూర్చుని ముళ్ళను తప్పించి, తంటాలు పడి వెలికి తీశాను.

గాలిలో విదిలించి తేరిపార చూశాను దాన్ని.

ఆ షర్టు డెల్లాది. నాకు బాగా గుర్తుంది. ఇక్కడికెలా

వచ్చిందానని ఆశ్చర్యపోతూ ఆలోచించసాగాను. డెల్లా ఈ ప్రాంతాలకు వచ్చిందా?

నా బుర్రవాడిగా పని చెయ్యడం మొదలెట్టింది. అష్ట కష్టాలుపడి ఇంతదూరం వచ్చినందుకు నిరాశ కలగలేదు.

నా అంచనా ప్రకారం డెల్లా ఖచ్చితంగా కొండ దాటి ఇటువేపు వచ్చివుండాలి? విశాలమైన ఈ ప్రాంతాల్లో ఎక్కడో పిచ్చిపట్టి తిరుగుతూ వుండాలి. ఆమెను వెతికి పట్టుకోవాలి.

అంత ఆనందంలోనూ, దూరంగా చెట్టు క్రింద దాహంతో మంచినీళ్ళకోసం ఎదురుచూస్తూ పడుకునివున్న అమెరికన్ నర్స్ కూడా గుర్తొచ్చింది. ఆమెను వెంటబెట్టుకొని తిరిగిరావాలని తీర్మానించుకున్నాను.

అడుగులు వడిగా వేశాను.

పది నిముషాల్లో ఆమెను వెంటబెట్టుకొచ్చాను నీళ్ళ గుంటదగ్గరకు. త్రోవలో ఆమెతో నేను మాట్లాడలేదు. నేను తెలుసుకొన్న విషయాన్ని అప్పుడే ఆమెకు చెప్పాలనిపించలేదు.

నాలాగే ఆమె కాళ్లూ చేతులూ, మొహం కడుక్కొని నీళ్ళు త్రాగి లేచింది.

"చాలా బావున్నాయి నీళ్ళు!" అంది ఆమె.

"వెళ్దామా?" అడిగాను నేను.

"ఎక్కడికి?"

"గమ్యం లేని ప్రయాణం మనది. ధ్యేయం మాత్రం తప్పిపోయిన డెల్లాను పట్టుకోవడం. ఆమెను వెతుకుతూ వెళ్దాం!" అన్నాను.

"ఇంతదూరం మనం రావడమే గగనమైపోయింది. మరి ఆమె రాగలిగి వుంటుందని నేననుకోను!" అందామె.

(సశేషం)